# ఆప్యాయత

ఒకరు మనల్నిష్టపడ్తున్నారూ... మన మీద తమ ఆప్యాయతానురాగాల్ని ప్రదర్శి స్తున్నారూ... మనకి తమ ప్రేమాభిమానాల్ని పంచిపెడ్తున్నారూ అంటే... మన మెంతటి నిరాశావాదులమైనా... మరుక్షణం ఆశావాదులుగా మారిపోతాం !

మనిషి బ్రతకడానికి కావలసిన కనీసావసరాలు ఎన్నో అయితే... 'మనసు' ని బ్రతికించే ఏకైక ఔషధం... 'ఆప్యాయత'.

ప్రేమ జనించినపుడు ఒకలా... ద్వేషించినపుడు మరోలా... కాకుండా, మన మంచి చెడులూ, బలహీనతల్నీ - కడుపులో దాచుకుని.... ఎలాంటి ఆరోహణావరోహణా ల్లేకుండా - ఎప్పుడూ ఒకే స్థాయిలో ఎదుటి వాళ్ళకి తన ఆప్యాయతని పంచిపెట్టే మనిషి ముందు...మనకి తెలీకుండానే మోకరిల్లుతాం!

మన దైనందిన జీవితంలో రకరకాల సమస్యలతో నలిగి, కుమిలిపోయే సమ యంలో... అది రవ్వంత ఆప్యాయతే అయినా... కొండంత ఉపశమనాన్ని కలిగి స్తుంది ! వెయ్యేనుగుల బలాన్నందిస్తుంది !

'మల్లెపూల... చందనాల' కలబోత... ఆప్యాయత!

దీన్ని గుండెల్నిండా నింపుకొని ఎదుటి మనిషిపై కురిపించగలగడమూ ఓ కళే అయితే...

అది సృష్టిలోని కళలన్నిట్లోకెల్లా....

లలితమూ,

రసభరితమూ,

సర్వోత్కృష్టమూ అన్పించుకుంటుంది!

ఎదుటివాళ్ళనుండి ఏదో ఆశించో.... తెచ్చి పెట్టుకున్నదో కాకుండా... మనసు అట్టడుగు పొరల్లోంచి ఊటలా విరజిమ్మే ఆప్యాయత.... మనసుని ఆర్ద్రం చేస్తుంది!

మనపట్ల శ్రద్ధ కనబరుస్తూ.... మన మీద ఈగవాలినా విలవిల్లాడే మనిషి... మన పరిసరాల్లో కనీసం ఒక్కరైనా ఉన్నారనుకుంటే...

ఆ ఊహ ఒక్కటే మనల్నీ, మన మనసుల్నీ ఉల్లాస భరితంగా ఉంచుతుంది!

అందుకే....

మన గుండెల్లో మనమీదా, మన వాళ్ళ మీదా పొంగిపొర్లే ప్రేమాప్యాయతల్లో.... కనీసం ఇసుమంతైనా వాటికోసం పరితపించే ఇతరులకీ అందివ్వగలిగితే...

అశక్తుడు శక్తిమంతుడవుతాడు !

భీరువు ధీరుడవుతాడు !

01-02-1995